క్లుప్తంగా

ఇంటి స్థలాల పంపిణీ



పట్టాలు పంపిణీ చేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ చైతన్య

అద్దంకి: కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్మాణంలో ముంపుకు గురైన అద్దంకి మండలం ధేనువుకొండ గ్రామానికి చెందిన ఎనిమిది మందికి శనివారం పునరావాస కాలనీల్లో ఇంటి స్థలాలను రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అందజేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ పునరావాస కాలనీల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. స్థలాలు పొందిన వారు ఇల్లు నిర్మించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మండల అధికారులు, వివిధ విభాగాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పకడ్బందీగా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

బల్లికురవ: గ్రామాల వారీగా ఓటర్ల చేర్పులు, సవరణలు తొలగింపులకు ఇంటింటికి కలిసికట్టుగా వెళదామని తహసీల్దార్ కె. రవిబాబు పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాపై శనివారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమం పూర్తిగానే షెడ్యూల్డ్ ప్రకటిస్తామని, షెడ్యూల్డ్ ప్రకారం ప్రతి గ్రామంలో కొత్త ఓట్ల చేర్పులు, చనిపోయిన వారిని, గ్రామాల్లో లేనివారిని తొలగింపునకు అన్ని పార్టీల సహకారంతో చేపడతామని తహసీల్దార్ ప్రకటించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతల పేరయ్య, టీడీపీ, బీజేపీ, సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

చీరాల అర్బన్: రాష్ట్రంలో లక్షలాది మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు, స్కీం వర్కర్లు కనీస వేతనాలు అమలు కాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. చీరాల రూరల్ మండలం వాడరేవులోని కే పాల్ గెస్ట్ హౌస్‌లో సీఐటీయూ జిల్లా వర్క్‌షాపును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మణిలాల్, మజుందార్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞానంపై అవగాహన

జే.పంగులూరు: విద్యార్థులు చక్కగా చదువుకొని, న్యాయ వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలని, అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి బీ బాబునాయక్ కోరారు. శనివారం నాయంత్రం ముప్పవరం గ్రామంలోని బీసీ బాలికల వసతి గృహంలో, మండల న్యాయసేవా సంస్థ అద్దంకి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా బాబు నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి మంచి ఉద్యోగాలు సంపాదించాలని, న్యాయ వ్యవస్థపై కూడా మంచి అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఏపీపీ కుసుమలత, ఏజీపీ వై రమేష్‌బాబు, వార్డెన్ పద్మావతి పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

నాకేమీ తెలియకపోయినా అన్నీ వలంటీరే అందిస్తోంది..



నా పేరు పుల్లమ్మ, కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామం. మా వలంటీర్ వీ వీరమ్మ మాకు పథకాల గురించి తెలియజేస్తుంది. మీకు ఈ పథకాలు వస్తాయని చెప్తుంది. పింఛన్, చేయూత, ఆసరా, రైతు భరోసా వచ్చేందుకు కాగితాలన్నీ తానే పూర్తి చేసి తెప్పించింది. ఎప్పుడూ అందుబాటులో ఉంటుంది.

– జీ పుల్లమ్మ, మేదరమెట్ల

ప్రభుత్వ పథకాలు నేరుగా వస్తున్నాయి..



మాది బల్లికురవ మండలం. మా వలంటీర్ హేమ. నా భార్యకు కరోనా సోకినా సేవలు అందించింది. నాకు గతేడాది ఆగస్టు నుంచి పింఛన్ ఇప్పించింది. నాలుగేళ్లుగా రైతు భరోసా వస్తోంది. నా భార్యకు ఈబీసీ ద్వారా ఏడాదికి రూ. 15 వేలు రెండేళ్ల నుంచి అందుతున్నాయి. వలంటీర్ హేమ మాకు అండగా ఉంటోంది.

– పావులూరి ఆంజనేయులు, బల్లికురవ

అలుపెరుగని ప్రజాసేవ

- పథకాలు అందించడమే వారి లక్ష్యం
- వలంటీర్ల సేవలు మరువలేనివి

అద్దంకి: ప్రజా సేవే పరమావధిగా పనిచేస్తున్నారు వలంటీర్లు. ఇస్తున్న గౌరవ వేతనం తక్కువే అయినా తమకు కేటాయించిన 50 కుటుంబాలకు సేవలందించిన సమయంలో వారు చూపే ఆదరణే తమకు తృప్తినిస్తోందని చెప్తున్నారు లబ్ధిదారులు. మరో వైపు తమకు గతంలో ఇలాంటి సేవలు అందేవి కావని, పథకాలకు అర్హులమైనా అధికారుల చుట్టూ తిరిగినా పని కాకుండా పోయేదని, ఏ పనికి ఎక్కడకు వెళ్తే అవుతుందో తెలిసేది కాదంటున్నారు. వలంటీర్ రాకతో ఆ చిక్కులన్నీ తొలగి గ్రామంలోనే సచివాలయం ఏర్పాటు కావడం, వలంటీరు అందుబాటులో ఉండడంతో పనులన్నీ గ్రామంలోనే చకాచకా అవుతున్నందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నారు లబ్ధిదారులు.

వలంటీర్ ద్వారా అన్ని పథకాలు అందాయి..



మాది అద్దంకి పట్టణంలోని 18వ వార్డు. కట్టకిందపాలెంలో ఉంటున్నాను. నేను డప్పు కళాకారుడిని. గత ప్రభుత్వ హయాంలో మా డప్పు కళాకారులకు ఏమీ ఇవ్వలేదు. ఎవరిని అడిగినా ప్రయోజనం లేకండా పోయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీరు అశోక్ వచ్చిన తరువాత డప్పు కళాకారుల పింఛన్ ఇప్పించాడు. చేయూత అందింది. మా పెద్ద కుమారైకు ఇంటి పట్టా ఇచ్చారు. వలంటీర్ సేవలు బాగున్నాయి.

– కొలకలూరి ప్రభాకరరావు, అద్దంకి

వలంటీర్ వల్లే పింఛన్..

మాది జే పంగులూరు మండలం, బూదవాడ గ్రామం. నా పేరు గుంజి సుబ్బయ్య. నాకు వృద్ధాప్య పింఛన్ నాలుగేళ్ల నుంచి వచ్చింది. అప్పట్లో ఎన్ని చోట్లకు తిరగినా పింఛన్ రాలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత మా వలంటీరు చేజర్ల గోపి మా ఇంటికి వచ్చి నీకు పింఛన్ వస్తుంది.. పెట్టుకోమని చెప్పి దరఖాస్తు చేశాడు. తానే రాసి నాచేత వేలిముద్ర వేయించుకున్నాడు. మూడేళ్ల నుంచి పింఛన్ పొందుతున్నాను. వలంటీర్ వల్లే ఇదంతా సాధ్యమైంది.



వలంటీర్ గోపి నుంచి పింఛన్ అందుకుంటున్న సుబ్బయ్య

– గుంజి సుబ్బయ్య, బూదవాడ

జగనన్న సురక్షతో సమస్యలకు పరిష్కారం



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య



దగ్గుబాడులో సురక్ష కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. శనివారం అద్దంకి మండలంలోని మోదేపల్లి, జార్లపాలెం గ్రామాల్లోని సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణచైతన్య మాట్లాడుతూ సాంకేతిక లోపాలతో సంక్షేమ పథకాలకు అర్హులు కాని వారు జగనన్న సురక్షలో సరైన సర్టిఫికెట్లు పొంది అర్హులు కావాలన్నారు. కార్యక్రమాన్ని ప్రజలు విశేషంగా ఆదరిస్తున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో తలపెట్టని కార్యక్రమాన్ని జగనన్న చేపట్టారన్నారు. కార్యక్రమంలో స్పెషల్ మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, ఎంపీడీవో దేవసేనకుమారి, అవిశెన ప్రభాకరరెడ్డి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారమే లక్ష్యం..

దగ్గుబాడు (కారంచేడు): గ్రామాల్లో పేద ప్రజల సంక్షేమం కోసం, వారి సమస్యల సత్వర పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తహశీల్దారు ఎస్ వెంకటరత్నం పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని దగ్గుబాడు గ్రామ సచివాలయం వద్ద 1284 ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, సర్పంచ్ గేరా రవీంద్రనాథ్ ఠాగూర్, గ్రామ కార్యదర్శి, వీఆర్‌ఓ, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు. కారంచేడు-1 గ్రామ సచివాలయ ప్రాంగణంలో జిల్లా సహకారశాఖాధికారి కేవీ రామారావు 1562 ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో డీ విజయలక్ష్మి, డీటీ పీ సుశీల, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

యద్దనపూడి: అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడటమే జగనన్న సురక్ష పథకం లక్ష్యమని జెడ్పీటీసీ చుండి లక్ష్మీనారాయణమ్మ అన్నారు. మండల పరిధిలోని గన్నవరం సచివాలయం పరిధిలో 827మందికి లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దారు వెంకటరెడ్డి, ఎంపీడీవో కృష్ణకుమారి, మండల ప్రత్యేకాధికారులు సాంబశివరావు, మోహన్‌రావు, జేసీఎస్ మండల కన్వీనర్ ధూళిపాళ్ల వేణు, సర్పంచ్ పల్లెపోగు అన్నమ్మ, ఎంపీటీసీ గొట్టిపాటి సతీష్‌కుమార్, ఉపసర్పంచ్ చెరుకూరి వేణు, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గన్నవరంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ

చంద్రమౌళి సేవలు మరువలేనివి

చీరాల: మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సజ్జా చంద్రమౌళి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. గడియార స్తంభం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి డాక్టర్ సజ్జా రవీంద్రబాబు, సజ్జా హేమలత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పట్టణాభివృద్ధికి చంద్రమౌళి అనేక సేవలందించారన్నారు. ప్రగడ కోటయ్య శిష్యులుగా ఉన్న సజ్జాను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర మాట్లాడుతూ ప్రజలకు ఉచిత వైద్యసేవలందించి చేనేత కార్మికులకు అండగా నిలబడి వ్యవసాయ రంగంలో వివిధ హోదాలలో పనిచేశారన్నారు. కార్యక్రమంలో చేనేత నాయకులు మేడా వెంకటరావు, శీలం వెంకటేశ్వర్లు, గుంటూరు బ్రహ్మం, బట్ట శివ కుమార్, పృథ్వీ నాగరాజు, బీసీ సంఘం నాయకులు గుంటి శ్రీనివాసరావు, బత్తుల అమిత్, చేనేత యువత సురేష్, విజయ కుమార్, అమర్, నాగరాజు, యశ్వంతరావు తదితరులు పాల్గొన్నారు.



చంద్రమౌళి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సంక్షేమం, అభివృద్ధే జగనన్న ధ్యేయం

- శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: సంక్షేమం, అభివృద్ధే జగనన్న ధ్యేయమని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. శనివారం రాత్రి మండలంలోని వెంపరాల సచివాలయం పరిధిలోని వెంపరాల గ్రామంలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. నవరత్నాల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలతో పరిపాలన ప్రజల వద్దకు తెచ్చారన్నారు. జగనన్నకు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్‌లు అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌కు అండగా ఉండి మరలా సీఎంను చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, ఎంపీపీ అవిశెన జ్యోతి, సర్పంచ్, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

విత్తనాల షాపులపై విజిలెన్స్ దాడులు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులోని విత్తనాలు దుకాణాలపై శనివారం సాయంత్రం విజిలెన్స్ ఏఓ వాసంతి తమ బృందంతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్థానిక డీలర్‌లు మిర్చి విత్తనాలను అధిక రేట్లకు విక్రయిస్తున్నారని కొందరు రైతుల ఫిర్యాదులపై తనిఖీలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. మండలంలో ఎక్కువగా మొక్కజొన్న, మిర్చి విత్తనాల విక్రయాలు జరిగినట్లు గమనించామన్నారు. డీలర్‌లు రైతుల నుంచి అధిక రేట్లు వసూలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో విజిలెన్స్ తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, సిబ్బంది సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న హయాంలోనే ముస్లిం, మైనార్టీలకు పెద్దపీట

యద్దనపూడి: ముస్లిం, మైనార్టీలను ఆదుకున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీనేనని, సీఎం జగన్ మోహన్‌రెడ్డి ముస్లిం సోదరుల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని బాపట్ల జిల్లా వక్ఫ్ బోర్డ్ వైస్ ప్రెసిడెంట్ షేక్ ఇమామ్ హుస్సేన్ అన్నారు. 'హర్ దిల్ మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ గద్దం మస్తాన్‌వలి ఆధ్వర్యంలో మండలంలోని పూనూరు, గన్నవరం, పోలూరు, అనంతవరం గ్రామాల్లోని మసీదులను సందర్శించి ఆయా మసీదు కమిటీ సభ్యులతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మసీదుల మరమ్మతులు, ప్రార్థనల కోసం స్థలం కేటాయింపు, శ్మశానాల అభివృద్ధి తదితర సమస్యల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. వారు తెలిపిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ బీబీ ఆయా గ్రామాల ముస్లిం, మైనార్టీ నాయకులు, మతపెద్దలు, పాల్గొన్నారు.



ఇమామ్‌లు, మౌజన్‌లతో ముస్లిం, మైనార్టీ నాయకులు

ముగిసిన డిజిటల్ విద్యా బోధన శిక్షణ



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ప్రభుత్వం పాఠశాలల ఉపాధ్యాయులకు 15 రోజులుగా డిజిటల్ విద్యాబోధనపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి బాపట్ల జిల్లాలోని తొమ్మిది మండలాల్లో వివిధ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని అద్దంకి, యద్దనపూడి, కొరిశపాడు, జే పంగులూరు, వేటపాలెం, పర్చూరు, ఇంకొల్లు, చినగంజాం మండలాల నుంచి 1400 మంది ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొన్నారని ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు తెలిపారు. బైజూస్ యాప్, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్‌పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ విధానం ద్వారా విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే రీతిలో బోధించవచ్చునని తెలిపారు.

రేపు మృతవీరుల సంస్మరణ సభ

చీరాల రూరల్: కారంచేడు గ్రామంలో జరిగిన దారుణ మారణకాండకు జూలై 17న 38 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా సంస్మరణ సభ నిర్వహిస్తున్నామని దుడ్డు భాస్కరరావు, తేళ్ల వెంకటస్వామిలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వారు మృతవీరుల రుధిర క్షేత్రం వద్ద సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చీరాలలోని విజయనగర్ కాలనీ సమీపంలో ఉన్న కారంచేడు మృత వీరుల రుధిర క్షేత్రం వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు మృత వీరుల సంస్మరణ సభ ఉంటుందన్నారు. అగ్రవర్ణ, భూస్వాముల దాడిలో 38 ఏళ్ల క్రితం మాదిగపల్లెపై విచక్షణా రహితంగా దాడిచేసి చంపేశారన్నారు. బాధితులందరూ ఏకతాటిపై నిలబడి సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేసిన దోషులకు శిక్షలు వేయించినట్లు చెప్పారు. అంతటి ఉద్యమాన్ని నడిపిన కారంచేడు బాధితులు, నాయకులు, మేధావులు, కార్యకర్తలు సంస్మరణ సభలో విధిగా పాల్గొని సభను విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో బుడంగుంట్ల లక్ష్మి నరసయ్య, సిర్ర భగత్ సింగ్, గొర్రెపాటి రవి పాల్గొన్నారు.



రుధిర క్షేత్రం వద్ద మాట్లాడుతున్న నాయకులు

గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

బల్లికురవ: ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీలు, సొంత స్థలాలకు మంజూరు చేసిన పక్కాగృహాలను పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా వైదన గ్రామంలోని జగనన్న కాలనీని ఆయన పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. గ్రామానికి 28 గృహాలు మంజూరు కాగా 26 పూర్తి కావడంపై సర్పంచ్ మేడా జయలక్ష్మి, వీవోఏను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ దుర్గ రమేష్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.